# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం-23-సెప్టెంబర్-2025 | సంపుటి:3 | సంచిక:118 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in


## గాజులరామారంలో పేదల ఇళ్ల కూల్చివేతపై కవిత తీవ్ర ఆగ్రహం

- మళ్లీ బుల్డోజర్ వస్తే అడ్డుగా నిలబడతానని హెచ్చరిక
- బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, 50 వేల సాయం డిమాండ్
- కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఆయన కబ్జా చేశారంటున్న 12 ఎకరాల భూమి సంగతి ఏంటని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గాజులరామారంలో హెచ్ఎండీఏ చేపట్టిన కూల్చివేతల బాధితులను పరామర్శించిన ఆమె, ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గాజులరామారంలో పర్యటించిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో..





## మేడారం జాతరను ఘనంగా నిర్వహించాలి

- లక్షలాది భక్తులు దర్శించుకునేందుకు వీలుగా మేడారంలో భారీ ఎత్తున అభివృద్ధి
- భారీ ఎత్తున స్వాగత తోరణాల నిర్మాణం
- జంపన్న వాగులో స్నానాలు ఆచరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయండి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మేడారం ఆదివాసీ గిరిజన జాతరను మరింత ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. జాతర ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ముఖ్యమంత్రి మంగళవారం రోజు ప్రత్యక్షంగా మేడారం క్షేత్ర స్థాయి సందర్శించనున్నారు. మేడారం జాతర కోసం గతంలో తాత్కాలిక ఏర్పాట్లు జరిగేవి. మేడారం ప్రాంతంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనుల కోసం వంద రోజుల కార్యాచరణను నిర్ధేశించిన ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్ర స్థాయిలో సమీక్షించనున్నారు. మేడారం పూజరులు, ఆదివాసీ పెద్దలు, మంత్రులు, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రముఖులతో జాతర నిర్వహణ, కొత్త నిర్మాణాలపై మేడారంలో సమీక్షిస్తారు. ఆదివాసీ సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ ఇలవేల్పులు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలున్న ప్రాంగణాన్ని లక్షలాది భక్తులు దర్శించుకునేందుకు వీలుగా మేడారంలో భారీ ఎత్తున అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. కోట్లాది భక్తులు వచ్చే జాతర ప్రాశస్త్యానికి తగ్గట్లు భారీ ఎత్తున స్వాగత తోరణాల నిర్మాణంతో పాటు గద్దెల వద్దకు భక్తులు సులువుగా చేరుకోవడం.. గద్దెల దర్శనం, బంగారం (బెల్లం) సమర్పణ.. జంపన్న వాగులో స్నానాలు ఆచరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు.

మిగతా 2లో..

## సింగరేణి కార్మికుల త్యాగం, శ్రమ, చరిత్ర ఎప్పటికీ మరువలేం

- సింగరేణి కార్మికులకు వరుసగా రెండో ఏడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త
- లాభాల్లో 34 శాతం మేరకు బోనస్‌ను ప్రకటన
- పరిశ్రమలు లాభసాటిలో నడుస్తున్నాయంటే కార్మికుల శ్రమ ఎంతో ఉంది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

దసరా పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు వరుసగా రెండో ఏడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త అందించారు. గడిచిన ఏడాది కాలంలో సింగరేణి సంస్థ ఉత్పత్తి, గడిరచిన లాభాలు, సాధించిన విజయాల ఆధారంగా కార్మికులకు 34 శాతం మేరకు బోనస్ ప్రకటించారు. సింగరేణి కార్మికులకు బోనస్ అందించాలన్న అంశంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు ఇతర మంత్రులు, సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సింగరేణి లాభాల్లో 34 శాతం మేరకు 819 కోట్ల రూపాయలను బోనస్‌ను ప్రకటించారు. తాజాగా ప్రకటించిన బోనస్ వల్ల ప్రతి కార్మికుడికి 1,95,610 రూపాయల చొప్పున ప్రయోజనం చేకూరనుంది. గతేడాది తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకూ రూ. 5 వేల చొప్పున బోనస్ అందజేయగా, ఈసారి రూ. 5,500 చొప్పున బోనస్ చెల్లించాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి చెప్పారు. 202425 ఆర్థిక సంవత్సరానికి గాను పన్నులు పోగా సింగరేణి 6,394 కోట్ల మేరకు లాభాలను గడిరచగా, అందులో సింగరేణి సంస్థ విస్తరణకు 4,034 కోట్లు కేటాయించారు.

మిగతా 2లో..

## ఇకపై ఇది తెలంగాణ భవన్ కాదు.. జనతా గ్యారేజ్



- ఆర్ఆర్ఆర్ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది
- సమస్యల పరిష్కారానికి తెలంగాణ భవన్‌లో న్యాయవాదుల సాయం
- అలైన్‌మెంట్లు మార్చడం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని విమర్శ

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై తెలంగాణ భవన్ కేవలం పార్టీ కార్యాలయం కాదని, ప్రజల సమస్యలు పరిష్కరించే 'జనతా గ్యారేజ్' అని ఆయన ప్రకటించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఇక్కడికి రావచ్చని, న్యాయ సహాయం కోసం నిపుణులైన న్యాయవాదులు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ వల్ల నష్టపోతున్న రైతులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. నల్గొండ, సూర్యాపేట, గజ్వేల్, సంగారెడ్డి నియోజకవర్గాల నుంచి వచ్చిన బాధితులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని విమర్శించారు.

మిగతా 2లో..

## రహదారుల నిర్మాణంతో కలిగే లాభాలను రైతులకు వివరించండి

- భూ సేకరణ, పరిహారం చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలి
- చిన్న చిన్న కారణాలతో పలు రహదారుల పనుల్లో జాప్యం జరగొద్దు
- భూ సేకరణను పూర్తి చేయడమే కాకుండా పరిహారం తక్షణమే అందేలా చూడాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ, పరిహారం చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవరించాలని, అదే సమయంలో రహదారుల నిర్మాణంతో కలిగే లాభాలను రైతులకు వివరించి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, అనుమతుల జారీ, నూతన ప్రతిపాదనలకు ఆమోదం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, జాతీయ రహదారుల విభాగం , జాతీయ రహదారులు, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ, రహదారులు, భవనాల శాఖ, అటవీ శాఖ అధికారులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారులకు నెంబర్ల కేటాయింపు, సూత్రప్రాయ అంగీకారం తెలుపుతున్నా, తర్వాత ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. చిన్న చిన్న కారణాలతో పలు రహదారుల పనుల్లో జాప్యం జరగొద్దని, అలాంటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

మిగతా 2లో..



## బడాబాబుల కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం

- గాజులరామారంలో ఆక్రమణల కూల్చివేత
- 317 ఎకరాల భూమికి కబ్జాల నుంచి విముక్తి
- రూ. 15 వేల కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

బడా బాబుల కబ్జాలపై హైడ్రా ఆదివారం ఉక్కుపాదం మోపింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని గాజులరామారంలో పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూమిని కాపాడిరది. సర్వే నంబరు 307తో పాటు పలు సర్వే నంబర్లలో ఉన్న 317 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించింది. ప్రభుత్వ భూమిలో వెలిసిన వెంచర్లను, లే ఔట్లను తొలగించింది. స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్‌కు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో తిష్ట వేసిన కబ్జాదారుల భరతం పట్టింది. ఇదే సర్వే నంబరు చుట్టూ కబ్జాలు జరగగా.. ప్రగతినగర్ వైపు ఏకంగా లేఔట్‌లు, వెంచర్లు వేశారు. ఇందులో రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ యజమానులు, కొంతమంది అధికారులు ఉన్నారు. 12 ఎకరాలలో వెలిసిన వెంచర్‌తో పాటు.. 20 ఎకరాల మేర ఉన్న లే ఔట్‌ను తొలగించింది. అందులో తాత్కాలికంగా బడాబాబులు వేసిన షెడ్డులను, ప్రహరీలను కూల్చివేసింది.

మిగతా 2లో..



## తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం

- అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షం
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఖైరతాబాద్ సహా పలు ప్రాంతాల్లో వర్షం
- పలు ప్రాంతాల్లో మోకాలి లోతు వరకు నిలిచిన నీరు

2లో

మంగళవారం-23- సెప్టెంబర్ 2025

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మేడారం జాతరను ఘనంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

మేడారం అభివృద్ధి పనుల్లో గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ఎటువంటి భంగం కలగవద్దనే కృతనిశ్చయంతో ఉన్న ప్రజా ప్రభుత్వం ప్రతి నిర్మాణం, ప్రతి కట్టడాన్ని పూర్తిగా ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా, మేడారం జాతర పూజారులు, ఆదివాసీ పెద్దల సూచనలతో ప్రభుత్వం చేపట్టనుంది. నిర్మాణాల్లో విలువైన గ్రానైట్, లైమ్‌స్టోన్ రాళ్లను వాడనున్నారు. పురాతన ఆలయాల పునఃనిర్మాణం, ప్రసిద్ధ ఆలయాల అభివృద్ధి పనుల్లో ప్రసిద్ధుడైన స్తపతి ఈమని శివనాగిరెడ్డి సేవలను మేడారం అభివృద్ధి పనులకు ప్రభుత్వం వినియోగించుకుంటోంది. గతంలో ముఖ్యమంత్రులు, మంత్రులు జాతరకు వెళ్లడం, దర్శనాలతో సరిపుచ్చేవారు. ఈసారి అందుకు భిన్నంగా ప్రపంచ పటంలో జాతరకు మరింత వన్నె తేవాలని ముఖ్యమంత్రి సంకల్పించారు. ఆదివాసీల సంప్రదాయాలు, ఆకాంక్షలకు అద్దంపట్టేలా మేడారం జాతరను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు తయారు చేయాలని ఇటీవలే అధికారులను ఆదేశించారు. రెండేళ్లకోసారి జరిగే మహా జాతరతో పాటు ఏడాది పొడవునా అన్ని రోజుల్లో మేడారం వచ్చి గద్దెలను దర్శించుకునే భక్తుల సంఖ్య పెరిగింది. వారాంతం, ఇతర సెలవు దినాల్లో ఈ రద్దీ మరింత పెరుగుతోంది. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన వసతి, సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. మేడారం అభివృద్ధి పనులతో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేయటంతో పాటు ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రభుత్వం ఊతమివ్వనుంది. ఫలితంగా మేడారం సమీపంలో ఉన్న రామప్ప, ఇతర ఆలయాలకు భక్తుల సంఖ్య పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

# సింగరేణి కార్మికుల త్యాగం, శ్రమ, చరిత్ర ఎప్పటికీ మరువలేం

(మొదటి పేజీ తరువాయి)

మిగిలిన 2360 కోట్లను వివిధ రూపాల్లో కార్మికుల సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించడంతో పాటు, అందులో 34 శాతం మేరకు బోనస్ ప్రకటించారు. మొత్తంగా దాదాపు 71 వేల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరుతుంది. దసరా పండుగను పురస్కరించుకుని ఈ బోనస్ ప్రకటించగా దీపావళి పండుగ సందర్భంలో బోనస్‌కు సంబంధించి మరో ప్రకటన చేస్తామని తెలియజేశారు. సింగరేణి అభివృద్ధిలో సహకరించిన కార్మిక సంఘాలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ సాధన ప్రక్రియలో సింగరేణి కార్మికుల త్యాగం, శ్రమ, చరిత్ర ఎప్పటికీ మరువలేమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న దశలో బొగ్గు ఉత్పత్తిని స్తంభింపజేసి ఆనాటి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి తెలంగాణ సాధన ప్రక్రియలో సింగరేణి కార్మికులు ప్రత్యేకమైన పాత్ర పోషించారని అన్నారు. తెలంగాణలో వారి భాగస్వామ్యాన్ని ప్రభుత్వం ఎప్పుడూ గుర్తిస్తూనే ఉంటుందని చెప్పారు. బొగ్గు గనుల ద్వారా సింగరేణి మొత్తం జాతికే వెలుగులు అందిస్తోందని, దేశంలో పరిశ్రమలు లాభసాటిలో నడుస్తున్నాయంటే కార్మికుల శ్రమ ఎంతో ఉందన్నారు. అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు లాభాల్లో వాటాలను పంచాలని నిర్ణయించామని అన్నారు. శ్రమ శక్తిని నమ్ముకున్న కార్మికులకు లాభాల్లో వాటాలను పంచడంతో పాటు సంస్థ భవిష్యత్తు ప్రణాళికలు, విస్తరణ కార్యక్రమాలు, కార్పొరేట్ రంగంతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కార్మికుల సంక్షేమం, అభివృద్ధి సాధించే దిశగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. సింగరేణి సంస్థ కార్పొరేట్ రంగంతో పోటీ పడి తలెత్తుకునేలా భవిష్యత్తు పెట్టుబడులు, ప్రణాళికలతో ముందుకు వెళ్లే విషయంలో కార్మిక సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులకు ముఖ్యమంత్రి సూచించారు గత ప్రభుత్వ హయాంలో టెండర్లలో పాల్గొనకపోవడం వల్ల కోల్పోయిన రెండు గనులను తిరిగి సింగరేణి ఆధ్వర్యంలోకి తీసుకొచ్చే విషయంలో అన్ని మార్గాలను అన్వేషిస్తామని స్పష్టం చేశారు ప్రస్తుత పోటీ ప్రపంచంతో సింగరేణి కూడా పోటీ పడుతుందని, ఆయాచిత లబ్ది కోసం ప్రయత్నించడం లేదని ముఖ్యమంత్రి చెప్పారు. సింగరేణి మనుగడ, లాభాల ఆర్జన, ప్రపంచంతో పోటీ పడటం వంటి కీలక అంశాలపై కార్మికులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమాలోచనలు చేసి పటిష్టమైన ప్రణాళికలతో ముందుకు పోతామని చెప్పారు. జీఎస్టీ సంస్కరణల నేపథ్యంలో రాష్ట్రం దాదాపు 7 వేల కోట్ల మేరకు ఆదాయం కోల్పోతోంది. ఆ నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. జీఎస్టీ సవరణలతో ఏర్పడిన వ్యత్యాసాన్ని పూరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ విషయంలో ఉప ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తారని చెప్పారు. మీడియా సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి , పొంగులేటి శ్రీనివాస రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాలరావు , అధికారులు పాల్గొన్నారు.

# ఇకపై ఇది తెలంగాణ భవన్ కాదు.. జనతా గ్యారేజ్

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రభుత్వ హయాంలో మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్వాసితులతో తామే స్వయంగా రోజుల తరబడి చర్చలు జరిపి, మెరుగైన పరిహారం, ఇళ్లు ఇచ్చి ఒప్పించామని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయికి వెళ్లడానికే ముఖం చాటేస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే అలైన్‌మెంట్లు మార్చి రైతులను ఇబ్బందులకు గురిచేసిందని కేటీఆర్ విమర్శించారు. అలైన్‌మెంట్లు మార్చి పేదల జీవితాలతో ఆడుకోవడం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని అన్నారు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను శాస్త్రీయంగా ఖరారు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటంలో రైతులెవరూ ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు గ్రామ గ్రామాన తీర్మానాలు చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలని ఆయన రైతులకు సూచించారు. అలా చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి సమస్యను పరిష్కరిస్తాయని తెలిపారు.


# గాజులరామారంలో పేదల ఇళ్ల కూల్చివేతపై కవిత తీవ్ర ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

కూలిపని చేసుకుని బతికే పేదల ఇళ్లను కూల్చడంలో హీరోయిజం ఏముందని హెచ్ఎండీఏ అధికారులను నిలదీశారు. ''పెద్దవాళ్లు చేసిన ఎకరాల కొద్దీ కబ్జాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా? ముందు అరికెపూడి గాంధీ కబ్జా చేసిన 12 ఎకరాల సంగతి తేల్చండి'' అని ఆమె డిమాండ్ చేశారు. పండుగ సమయంలో పేదల జీవితాలతో ఆడుకోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఆదివారం రోజున ఇళ్లు కూల్చడం అమానుషమని మండిపడ్డారు. కూల్చివేతలకు గురైన బాధితులకు ప్రభుత్వం తక్షణమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని, తక్షణ సాయంగా రూ. 50 వేలు అందించాలని కవిత డిమాండ్ చేశారు. వచ్చే నెల 6వ తేదీలోగా బాధితులకు న్యాయం జరగకపోతే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ''మళ్లీ ఇక్కడికి బుల్డోజర్ వస్తే, దానికి అడ్డుగా నిలబడే మొదటి వ్యక్తిని నేనే అవుతా'' అని ఆమె హెచ్చరించారు. వెంచర్లు వేసి అమ్మిన వారి నుంచి బాధితులకు డబ్బులు తిరిగి ఇప్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ముఖ్యమంత్రి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, ఆయన తన గడీ దాటి రావడం లేదని కవిత విమర్శించారు. ప్రజా పాలన అంటూనే ప్రజల గోడు వినేవారే కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి రాష్ట్రంలో ఉందని దుయ్యబట్టారు. బాధితుల వివరాలు తానే స్వయంగా సేకరించి, ప్రభుత్వ కార్యాలయానికి వస్తానని, ఎక్కడికి రావాలో చెప్పాలని సవాల్ విసిరారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారినా పోచమ్మ బస్తీ పరిసరాల్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడలేకపోయారని, ఇప్పుడు హడావుడిగా వచ్చి పేదలపై ప్రతాపం చూపడం దారుణమని అన్నారు.

# సింగరేణి కార్మికులకు దసరా కానుకగా రూ.810 కోట్లు బోనస్

**సత్తుపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి కార్మికులకు దసరా కానుకగా భారీ బోనస్ ప్రకటించారు. 202425 ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల్లో భాగంగా రూ.810 కోట్లు కార్మికులకు పంపిణీ చేశారు.



ఈ కార్యక్రమం సోమవారం నాడు హైదరాబాదులో డా. బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో జరిగింది. ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, ఎంపీలు రఘురాం రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, సింగరేణి యాజమాన్యం పాల్గొన్నారు.

సింగరేణి 202425లో మొత్తం రూ.6,394 కోట్లు ఆదాయం ఆర్జించింది. అందులో రూ.4,034 కోట్లు సంస్థ విస్తరణకు కేటాయించగా, రూ.2,360 కోట్లు కార్మికులకు పంపిణీ చేశారు. దసరా బోనస్‌గా 34 శాతం మేరకు రూ.810 కోట్లు కేటాయించారు. దీని ప్రకారం 41 వేల మంది శాశ్వత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,95,610 చొప్పున అందించనున్నారు. అలాగే దేశ చరిత్రలోనే తొలిసారి 30 వేలమంది కాంట్రాక్ట్ కార్మికులకు కూడా ఒక్కొక్కరికి రూ.5,500 బోనస్ ప్రకటించారు. దీపావళి సందర్భంగా యథావిధిగా మరో బోనస్ ఇవ్వనున్నట్టు యాజమాన్యం వెల్లడించింది.

దేశానికి, రాష్ట్రానికి వెలుగులు నిచ్చే సంస్థగా సింగరేణి నిలుస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ సంస్థను కాపాడుకోవడం కార్మికుల బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. కార్మికులకు ప్రజా ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఖైరతాబాద్, ఎల్బీనగర్, పెద్ద అంబర్‌పేట మొదలైన ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులపై నీరు నిలిచిపోయింది. ఖైరతాబాద్ రాజ్ భవన్ రోడ్డులో మోకాలి లోతు వరకు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అమీర్‌పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో హైడ్రా మరియు జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయక



చర్యలు చేపట్టారు. అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సోమవారం, మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# రహదారుల నిర్మాణంతో కలిగే లాభాలను రైతులకు వివరించండి

(మొదటి పేజీ తరువాయి)

భూ సేకరణను పూర్తి చేయడమే కాకుండా పరిహారం తక్షణమే అందేలా చూడాలని చెప్పారు. రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం నిర్మాణానికి సంబంధించి కేంద్రం లేవనెత్తిన ప్రతి సందేహాలను నివృత్తి చేస్తున్నప్పటికీ కొత్త సమస్యలను ఎందుకు లేవనెత్తుతున్నారని ఎన్‌హెచ్ఏఐ అధికారులను ముఖ్యమంత్రి గారు ప్రశ్నించారు. సందేహాలన్నింటిని ఒకేసారి పంపాలని కోరినప్పుడు, ఎటువంటి సందేహాలు లేవని, ఏవైనా ఉంటే వెంటనే పంపుతామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు. ''ఆర్ఆర్ఆర్ దక్షిణ, ఉత్తర భాగాలు రెండు వేర్వేరు ప్రాజెక్టులుగా చూడొద్దు. సౌత్‌కు కూడా నార్త్‌కు ఇచ్చిన నెంబర్‌ను కొనసాగించాలి. వెంటనే అనుమతులు మంజూరు చేసి ఏకకాలంలో రెండిరటి పనులు ప్రారంభమయ్యేందుకు ఎన్‌హెచ్ఏఐ సహకరించాలి. ఆర్ఆర్ఆర్ సౌత్ అలైన్‌మెంట్‌కు వెంటనే ఆమోదముద్ర వేయాలి భారత్ ఫ్యూచర్ సిటీ అమరావతి మచిలీపట్నం 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకు వెంటనే అనుమతులు ఇవ్వాలి. భారత్ ఫ్యూచర్ సిటీలో తాము డ్రైపోర్ట్, లాజిస్టిక్ పార్క్, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తాం. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య అనుసంధానం ఏర్పడడంతో సరకు రవాణా, ప్రయాణికులకు ఎంతగానో సౌకర్యవంతంగా ఉంటుంది. హైదరాబాద్ విజయవాడల మధ్య 70 కి.మీ దూరం తగ్గడంతో పాటు సరుకు రవాణాతో దేశంలో మరే జాతీయ రహదారిపై లేనంత రద్దీ, ఆదాయం ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో ఏర్పడుతుంది. ఈ రహదారికి సమాంతరంగా తాము రైలు మార్గం అడుగుతున్నాం, బెంగళూర్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అమరావతి మధ్య రైలు మార్గం అవసరం. వందేభారత్ సహా ఇతర రైళ్ల రాకపోకలకు ఇది అనువుగా ఉండటమే కాకుండా లాభసాటిగా ఉంటుంది. హైదరాబాద్ శ్రీశైలం మార్గంలో రావిర్యాల మన్ననూర్‌కు సంబంధించి ఎలివేటెడ్ కారిడార్‌కు వెంటనే అనుమతులు ఇవ్వాలి. శ్రీశైలం దేవస్థానం, శ్రీశైలం రిజర్వాయర్, టైగర్ ఫారెస్ట్ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తారు'' అని వివరించారు. హైదరాబాద్ మన్నెగూడ రహదారిలో మర్రి చెట్ల తొలగింపునకు సంబంధించి ఎన్జీటీలో ఉన్న కేసు పరిష్కారానికి సత్వరమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్‌మంచిర్యాల నాగ్‌పూర్ నూతన రహదారికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమర్పించిన ప్రతిపాదనలను ఎన్‌హెచ్ఏఐ అంగీకరించాలి. మంచిర్యాల వరంగల్ ఖమ్మం విజయవాడ జాతీయ రహదారి, ఆర్మూర్ జగిత్యాల మంచిర్యాల, జగిత్యాల కరీంనగర్), మహబూబ్‌నగర్ మరికల్ దియోసుగూర్ రహదారులకు సంబంధించి భూ సేకరణ, పరిహారం పంపిణీలో జాప్యంపై ఆయా జిల్లాల కలెక్టర్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అన్ని జిల్లాల్లో ఉన్న కేసులన్నింటిపై నివేదిక రూపొందించి వారంలోపు అడ్వకేట్ జనరల్‌తో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారిని ఆదేశించారు. ఈ విషయంలో ఏమాత్రం జాప్యాన్ని సహించమని సీఎం కలెక్టర్లను హెచ్చరించారు. భూసేకరణ, పరిహారం పంపిణీని అక్టోబరు నెలాఖరుకు కచ్చితంగా పూర్తి చేయాల్సిందేనని కలెక్టర్లను ఆదేశించారు. భూ సేకరణ, పరిహారం నిర్ణయం, పంపిణీ విషయంలో అలసత్వం చూపే కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లపై వేటు వేస్తామని హెచ్చరించారు. జాతీయ రహదారుల నిర్మాణంలో అటవీ, పర్యావరణ శాఖ నుంచి ఎదురవుతున్న ఇబ్బందులపైనా సీఎం సమీక్షించారు. అవసరమైనచోట ప్రత్యామ్నాయ భూమిని అటవీ పెంపకానికి ఇస్తామని తెలిపారు. ఈ విషయంలో అవసరమైతే జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో స్వయంగా కలిసి మాట్లాడుతానని చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావు తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బడాబాబుల కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ భూమిలో రహదారుల నిర్మాణం, కరెంటు కనెక్షన్లు ఇలా దర్జాగా సాగిపోయిన బడాబాబుల దందాకు హైడ్రా ఫుల్‌స్టాప్ పెట్టింది. ఆక్రమణలను తొలగించిన తర్వాత చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తోంది.

`పేదల పేరిట కబ్జాలు మరోవైపు..

ప్రగతినగర్‌వైపు బడాబాబులు ఏకంగా వెంచర్లు, లే ఔట్లు వేస్తే.. గాజులరామారం సర్వే నంబర్లు 329/1, 342 లో ఉన్న ప్రభుత్వ భూమిని 60 గజాలు, 120 గజాల ప్లాట్లచొప్పున పేదలే లక్ష్యంగా పెట్టుకుని అమ్మేసుకున్న రౌడీషీటర్లు, స్థానిక చోటమోటా నాయకులు, గుండాగిరి, దాదాగిరితో బతుకుతున్న మరికొందరికి కూడా హైడ్రా చెక్ పెట్టింది. జగద్గిరిగుట్ట పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్న షేక్ అబిద్ ఏకంగా లక్ష్మి మురళి హుస్సేన్ పేరుమీద ప్లాట్ల విక్రయాలు జరిపారు. బోడాసు శ్రీనివాస్(డాన్ సీను), ఏసుబాబు, సయ్యద్ గౌస్ బాబు, మనీష్, దేవా ఇలా ఎవరికి వారు ఆక్రమించేసి ప్లాట్లుగా అమ్మేసుకున్న వారికి హైడ్రా ఆదివారం చెక్ పెట్టింది. స్థానిక రెవెన్యూ అధికారులు కూడా వీరికి సహకరించినట్టు సమాచారం. దీనిపై పూర్తి స్థాయిలో హైడ్రా విచారణ చేపట్టింది. 60, 120 గజాల చొప్పున ప్రహరీ నిర్మించి.. అందులో ఒక గదిని కట్టి.. కిరాయి లేకుండా ఒక కుటుంబానికి అద్దెకు ఇవ్వడం.. కొనుగోలుదారుడు దొరికిన తర్వాత ఆ ప్లాట్‌ను అమ్మేయడం.. తర్వాత మరో ప్లాట్ ఇలా సాగిపోయిన కబ్జాలకు హైడ్రా చెక్‌పెట్టి... ఆక్రమణల దందాకు బ్రేకులు వేసింది.

`పేదల ఇళ్ల జోలికి వెళ్ల లేదు..

ఇప్పటికే నివాసం ఉంటున్న వారి ఇళ్ల జోలికి హైడ్రా వెళ్లలేదని మరోసారి స్పష్టంచేసింది. రౌడీల ఆధీనంలో ఉండి అమ్మకానికి సిద్ధంగా ప్రహరీలు నిర్మించి ఉన్న వాటిని మాత్రమే హైడ్రా తొలగించింది. అక్కడ నివాసం ఉంటున్న పేదల ఇంటింటికీ వెళ్లిన హైడ్రా అధికారులు పదేపదే ఈ విషయాన్ని స్పష్టం చేశారు. మొదట్లో అక్కడ నివాసం ఉంటున్నవారు ఆందోళన చెందినా.. వారికి స్పష్టమైన హామీ లభించడంతో ఊరట చెందారు. హైడ్రా, జీహెచ్ ఎంసీ, రెవెన్యూ, పోలీసు అధికారులు పలుమార్లు ఈ విషయాన్ని స్పష్టం చేయడంతో పాటు.. అక్కడ కూల్చివేతలను గమనించిన స్థానికులు ఆందోళన చెందలేదు. ఎవరైతే అక్కడ బోర్డులు పెట్టి ప్లాట్ల విక్రయాలకు పాల్పడుతున్నారో వారే ఆందోళనకు దిగారు. నవాసితులుగా చూపించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ ఎత్తుగడలన్నిటినీ చిత్తు చేస్తూ ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసే పనిని వేగవంతం చేసింది.

`పూర్తి స్థాయిలో పరిశీలించాకే చర్యలు..

గాజుల రామారంలోని సర్వేనంబరు 307 తో పాటు.. ఆ పక్కనే ఉన్న సర్వే నంబర్లలో 444 ఎకరాలకు పైగా ప్రభుత్వభూమి ఉంది. ఇందులో సర్వే నంబరు 307లోనే 317 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు అప్పటి ప్రభుత్వం ఈ భూమిని అప్పగించింది. ఆ తర్వాత రాష్ట్రం విడిపోవడం.. ఫైనాన్స్ కార్పొరేషన్‌కు చెందిన ఆస్తుల పంపకాల్లో జరిగిన జాప్యాన్ని ఆసరాగా తీసుకుని ఎవరికి వారు ఆక్రమణలకు పాల్పడ్డారు. ఈ విషయమై హైడ్రాకు స్థానికుల నుంచి పెద్ద మొత్తంలో ప్రజావాణిలో ఫిర్యాదులందాయి. ఆ ఫిర్యాదుల మేరకు సర్వే నంబర్ల వారీ.. విచారణను హైడ్రా చేపట్టింది. రెవెన్యూ అధికారులు, జీహెచ్ ఎంసీ, ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులతో 5 6 సార్లు సమావేశం ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో విచారణ జరిపింది. 6 నెలలుకు పైగా పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంది.



# సత్తుపల్లిలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు..!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ, తెలంగాణ రాష్ట్ర పండుగగా ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా జరుపుకుంటారు. దసరా సందర్భంగా సత్తుపల్లి పట్టణంలో వాడవాడలా బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దుర్గమ్మ అమ్మవారి సాక్షిగా మహిళలు పట్టణంలోని అన్ని కాలనీలలో రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, పాటలు పాడుతూ ఆనందంగా ఉత్సవాలు జరుపుకుంటున్నారు. జవహర్ నగర్, గుడిపాడు, అంబేద్కర్ నగర్, ద్వారకాపురి కాలనీ, జలగం నగర్, గాంధీనగర్, వెంగళ రావు నగర్, విరాట్ నగర్, అయ్యగారి పేట, ఎన్టీఆర్ నగర్, హనుమాన్ నగర్, విద్యానగర్, రాజీవ్ నగర్ వంటి పట్టణంలోని వివిధ కాలనీలు, దేవాలయాల వద్ద పిల్లలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొంటూ బతుకమ్మ సంబరాలను జరుపుకుంటున్నారు.



# కాప్రాలో ద్విముఖ బతుకమ్మ ఆకర్షణగా నిలిచిన వేడుకలు

**కుషాయిగూడ, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ లో కాప్రా సాయి లీల ఎంక్లేవ్ కాలనీలో బతుకమ్మ వేడుకలు విశేషంగా జరిగాయి. ఈసారి కాలనీవాసుల మహిళలు మొదటి సారిగా ద్విముఖ బతుకమ్మను తయారు చేసి పండుగ జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ ద్విముఖ బతుకమ్మను ఆ కాలనీకి చెందిన ప్రఖ్యాత శిల్పి డాక్టర్ హోతి బసవరాజ్ ప్రత్యేక నైపుణ్యంతో రూపొందించారు. ఆయన ప్రతిభను అభినందిస్తూ కాలనీవాసులు ఘనంగా సత్కరించారు.వేడుకల్లో కాలనీ పెద్దలు, సొసైటీ ప్రతినిధులు ప్రెసిడెంట్ ఎం. ప్రభాకరన్, వైస్ ప్రెసిడెంట్ ఎం. విజయలక్ష్మి, జనరల్ సెక్రటరీ పి. విజయేంద్ర, జాయింట్ సెక్రటరీ బి. రుశెందర్, ట్రెజరర్ ఎం. మహంకాళి రావుతో పాటు టి. రామదాస్, శాంతి హరిరెడ్డి, మహమ్మద్ గౌరీ, ఎస్. నాగేశ్వరరావు, వివి రమణ, ఎస్.వి.వి. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.బతుకమ్మ చుట్టూ ఆడిపాడిన కాలనీవాసులు, దేశ ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ ప్రత్యేక ద్విముఖ బతుకమ్మ కాలనీలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లోనూ చర్చనీయాంశమైంది.




# యువత క్రమశిక్షణ కలిగి నడుచు కోవాలి

## స్టేట్ కోఆర్డినేటర్ శిరీష


**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 22, తెలంగాణ ముచ్చట్లు;** చింతకాని మండలం లో భోస్కో సేవా కేంద్రం వారి సహకారంతో మాస్ సంస్థ ఆధ్వర్యములో ప్రొద్దుటూరు, నాగిలిగొండ మరియు తూటికుంట్ల గ్రామాలనుండి 40మంది యువతి యువకులు యూనిట్ గా ఉంటూ ఈ కార్యక్రమంకీ హాజరైనారు ఈ రోజులలో యువత పెడత్రోవ పాడుతున్నారు అంటూ రెండు తెలుగు రాష్ట్రాల రీజనల్ కో ఆర్డినేటర్ అంబేద్కర్ సార్ యువతను ఉద్దేశించి వారికీ ఫిలిమ్ ద్వారా యువత పెడత్రోవ పడుతున్న విధానాన్ని తెలియచేసినారు సమాజంలో యువత వారి పాత్ర గురించి చాలా బాగా వివరించినారు తల్లిదండ్రుల పట్ల గురువుల పట్ల ఏ విధంగా ఉండాలో తెలియ చేసినారు. ఈకార్యక్రమంలో తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ శిరీష పాల్గొన్నారు. స్టేట్ కోఆర్డినేటర్. శిరీష మాట్లాడుతూ యువత క్రమశిక్షణ కలిగి నడుచు కోవాలని తోటి వారితో మర్యాదగా మసలుకోవాలని.. మత్తుకి బానిసలు కాకూడదని యువతను ఉద్దేశించి. మాట్లాడినారు చివరిగా మాస్ డైరెక్టర్ డాక్టర్. పి. లక్ష్మికాంతమ్మ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక అని యువత మారితే సమాజభివృద్ధి జరుగుతుందని మార్పు గురించి చైతన్య గీతాలతో యువతను గురించి వివరించారు ఏ కార్యక్రమానికి చందు శ్రీను రత్నాకర్ గోపాల్ మరియు మూడు గ్రామాల యువతి యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.






# గాజులరామారం బస్తీలలో పేదల ఇళ్ళ ధ్వంసం – ఈటల రాజేందర్ ఆవేదన

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం ప్రాంతంలో ఐదు బస్తీలలో పేదల ఇళ్లు కూల్చివేత కలకలం రేపింది. హైడ్రా యంత్రాలతో ఆదివారం ఉదయం ప్రారంభమైన ఈ ఆపరేషన్‌లో దాదాపు 300 గుడిసె లు కూల్చివేయబడ్డాయి.ఇళ్ల కోలతో అనేక కుటుంబాలు రాత్రంతా వర్షంలో చిన్నపిల్లలతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కరెంటు స్తంభాలను కూడా కూలగొట్టడంతో ప్రాంతం విద్యుత్ లేకుండా పోయింది. తాగునీటి సౌకర్యం కూడా నిలిచిపోయింది.ఈ ఘటనపై మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. సోమవారం ఉదయం బస్తీలను సందర్శించి బాధితులతో మాట్లాడిన ఆయన మాట్లాడుతూ - "నిజాంలు, రాజులు కూడా ఇంత మానవత్వం లేకుండా ప్రవర్తించలేదు. 40 ఏళ్లుగా ఇక్కడే జీవిస్తున్న వడ్డెరలు, కూలీలు, పేదవారి ఇళ్ళను కూల్చడం హృదయవిదారకం. బతుకమ్మ పండుగ రోజే చిన్న పిల్లలతో వర్షంలో రోడ్డుపై ఉండే పరిస్థితి తెచ్చారు. ఇది శత్రుదేశం మీద దాడి చేసినట్టే" అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈటల రాజేందర్ మాట్లాడుతూ, "బ్రోకర్ల ఉంటే అరెస్ట్ చేయండి, డబ్బులు రికవరీ చేయండి కానీ పేదల జీవితాలతో ఆడుకో వద్దు." "300 గుడిసెలు కూల్చి 15 వేల కోట్ల ఆస్తిని కాపాడామంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటు." "ప్రభుత్వ భూములు పేదలకు దక్కాలి, బిల్డర్లు - బ్రోకర్లకు కాదు." అని ఘాటుగా విమర్శించారు.ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆయన వెంటనే కూల్చివేత బాధితులకు కరెంటు, తాగునీటి సదుపాయాలు పునరుద్ధరించడంతో పాటు ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.బస్తీ ప్రాంతాల్లో నరసింహ బస్తీ, బాలయ్య బస్తీ, గాలిపోచమ్మ బస్తీల ప్రజలతో ఈటల నేరుగా మాట్లాడారు. "పిల్లల పుస్తకాలు, ఇంటి సామాన్లను తొక్కించి, కన్నీటి మధ్య పేదలను రోడ్డుపైకి నెట్టేయడం అమానవీయ చర్య" అని విమర్శించారు. "పేదల జోలికి వస్తే మాడి మసి అవుతారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం?" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.





# రాంపల్లిలో వైభవంగా శ్రీ దేవీ దసరా శరన్నవరాత్రుల పూజలు

**నాగారం, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)** : రాంపల్లి శ్రీ మహంకాళి దేవాలయంలో 33వ శ్రీ దేవీ దసరా శరన్నవరాత్రుల పూజా కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో శ్రీ మహంకాళి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.మొదటి రోజు పూజా కార్యక్రమాల్లో శ్రీ గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ పూజ, కలశ స్థాపనతో పాటు ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు ప్రధాన అర్చకులు గొంగులూరి రాం మూర్తి శర్మ, గణపురం రాంప్రసాద్ శర్మ, గణపురం శ్యామ్ సుందర్ శర్మలచే పూజలు జరిగాయి.దుర్గా భవాని మాత విగ్రహ దాత జమ్మల ప్రశాంత్ గౌడ్ దంపతులు ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకోగా, అనంతరం హైటెక్ డెవలపర్స్ శ్రీ బొడిగం కోటిరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది.కీసర సీఐ ఆంజనేయులు, ఎస్సై హరిప్రసాద్ అమ్మవారిని దర్శించుకోగా, ఆలయ కమిటీ చైర్మన్ ఎలసాని భూమయ్య యాదవ్ మరియు కమిటీ సభ్యులు వీరికి స్వాగతం పలికి తీర్థ ప్రసాదం అందజేశారు.ఈ వేడుకల్లో కమిటీ ఉపాధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, కోశాధికారి ఎల్లమయ్య, సభ్యులు మహేందర్ రెడ్డి, ఓం ప్రకాష్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, సోమిరెడ్డి, బాలనరసింహ, శ్రీశైలం, శివరాజ్ యాదవ్, కుమార్, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు, యువజన సంఘాల యువకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







# ఆశా వర్కర్లతో ఆన్లైన్ పనులు చేయించొద్దు –సిఐటియు ధర్నా

**కుషాయిగూడ, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఆశా వర్కర్లపై అనవసరమైన పనిభారం మోపడం ఆపాలని, వారికి కనీస వేతనం రూ.18,000 చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి డిమాండ్ చేశారు. కుషాయిగూడ పీహెచ్‌సీ వద్ద సోమవారం ఆశా వర్కర్లు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రేవతి కళ్యాణి మాట్లాడుతూ -ప్రస్తుతం మాతా, శిశు ఆరోగ్యం కోసం నియమించిన ఆశాలతో బీపీ చెక్ చేయడం, బ్లడ్ టెస్టులు చేయించడం, ఆన్లైన్ మెడిసిన్ ఇవ్వడం వంటి అదనపు పనులు చేయిస్తున్నారని తెలిపారు. అధికారులు ట్యాబ్స్, ఫోన్లు, నెట్ సదుపాయం ఇవ్వకుండానే ఆన్లైన్ పనులు చేయించాలని బలవంతం చేస్తున్నారని, పనులు చేయని పక్షంలో విధుల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని విమర్శించారు.అలాగే ఎల్సిడిసి సర్వే అమౌంటు, హెచ్‌బిఎన్‌సి, హెచ్‌బివైసి, ఎల్డర్లి కేర్ ట్రైనింగ్ ఇన్సెంటివ్, అడల్ట్ బిసిజి సర్వే ఇన్సెంటివ్ వంటి పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "డిగ్రీలు చదివి కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారు చేయాల్సిన పనులను ఆశాలతో చేయించడం అన్యాయం. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆన్లైన్ పనుల నుండి ఆశా వర్కర్లను విముక్తి చేయాలి" అని రేవతి కళ్యాణి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ పీహెచ్‌సీకి చెందిన అనేకమంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి మోడీకి పాలాభిషేకం

## ఎంపీ ఈటల రాజేందర్

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)** కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సూరారం 129వ డివిజన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పై ఘన సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ స్వయంగా మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆయన నిర్ణయాలకు మద్దతు తెలిపారు.ఈటల మాట్లాడుతూ "జీఎస్టీ పన్ను భారం తగ్గించడం ద్వారా సాధారణ ప్రజలపై ఉన్న ఆర్థిక ఒత్తిడి తగ్గింది. వ్యాపార వర్గాలు కూడా ఈ నిర్ణయంతో ఊరట పొందాయి. ప్రజల భారం



తగ్గించడమే మోడీ ప్రభుత్వ లక్ష్యం" అని పేర్కొన్నారు.అదే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తున్నాయని, ప్రతి వర్గం ప్రజల ప్రగతికి మద్దతు ఇస్తున్నాయని ఈటల రాజేందర్ అన్నారు. ప్రజల సంక్షేమం కోసం తీసుకొస్తున్న విధానాలను మద్దతు ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, కార్పొరేటర్ శేషగిరి, గిరివర్ధన్ రెడ్డి, భారత్ సింహా రెడ్డి, సతీష్ సాగర్, ఎం.ఎస్. వాసు, శేఖర్ యాదవ్, పున్నారెడ్డి, ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.స్థానిక వ్యాపారులు కూడా ఈ వేడుకలో పాల్గొని మోడీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పాలాభిషేకం అనంతరం భారీగా నినాదాలు చేస్తూ వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొట్లపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# షాదీ ముబారక్,కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

## కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య

**హనుమకొండ,సెప్టెంబర్22(తెలంగాణ ముచ్చట్లు):** అంబేద్కర్ భవనంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ లబ్ధిదారులకు సోమవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా 135 మందికి రూ.1,35,15,600 విలువైన కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కులు, 128 మందికి రూ.43,28,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 262 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి-సంక్షేమాలను సమపాళ్లలో ముందుకు నడిపిస్తోందని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై వడ్డీలు కడుతూనే, కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరంతరంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నిజమైన పేదల ప్రభుత్వం అని, బడుగు-బలహీన వర్గాలకు అండగా ఉంటూ అన్ని వర్గాల ప్రజలకు రక్షణ కవచంగా నిలుస్తోందని అన్నారు. కాంగ్రెస్ మాటలకే పరిమితం కాని, చేతల్లోనే నమ్మకం ఉంచే ప్రభుత్వం అని ఎంపీ స్పష్టం చేశారు. వరంగల్‌లో ఇరువై ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు కాంగ్రెస్ పాలనలో ఒక్కొక్కటిగా పూర్తవుతున్నాయని తెలిపారు. ప్రజల విశ్వాసానికి తగ్గట్టుగా అభివృద్ధి, సంక్షేమ రంగాలలో సమతౌల్యంగా ముందుకు సాగడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, స్థానికులు పాల్గొన్నారు.





# నాగారం మున్సిపాలిటీలో వరద ముంపు సమస్యపై మహిళల రాస్తారోకో

**నాగారం, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** నాగారం మున్సిపాలిటీ పరిధిలో వరద ముంపు సమస్యలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే ప్రతి సారి ఇళ్లు నీటమునిగిపోవడం, రహదారులు చెరువుల్లా మారిపోవడం వల్ల ప్రజల జీవనోపాధి దెబ్బతింటోందని 22 కాలనీల మహిళలు గళమెత్తారు.సోమవారం పెద్ద సంఖ్యలో మహిళలు నాగారం మెయిన్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి మున్సిపల్ డి.ఈ సంతోష్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రధాన రహదారి వెంబడి శాశ్వత మురికినీటి కాల్వ నిర్మించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు.మహిళలు మాట్లాడుతూ, వరదనీరు ఇళ్లలోకి చేరడం, రోడ్లు గుంతలుగా మారడం, వృద్ధులు బయటకు రావలేని పరిస్థితులు, చిన్నపిల్లలు పాఠశాలకు వెళ్లలేని ఇబ్బందులు ఏళ్లుగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు తీవ్రంగా విమర్శించారు. ప్రధాన నినాదాలతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేసిన మహిళలను పోలీసులు సముదాయించి రాస్తారోకోను ముగింపునకు తీసుకువచ్చారు. వెంటనే చర్యలు తీసుకోవాలని మహిళలు మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు.ఈ నిరసనలో బీఎంఆర్ కాలనీ, సాయి రత్న కాలనీ, ఎస్ఎల్ఎన్ కాలనీ, తివారి ఎంక్లేవ్, అరవింద నగర్, మనీ ఎంక్లేవ్, వీఆర్ నగర్, సాయి సంజీవ్ నగర్, బిపిసి, బీబీసీ కాలనీ తదితర ప్రాంతాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 22, తెలంగాణ ముచ్చట్లు:** దేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.పోలీస్ శాఖ మహిళలు బతుకమ్మ ఆడేటువంటి ప్రాంతాల్లో, దుర్గామాత అమ్మవారు ఏర్పాటు చేసిన ప్రాంతాలలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, పెట్రోలింగ్, విజబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వేడుకలు జరిగే అన్ని ప్రాంతాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు పోలీసు యంత్రాంగం గట్టి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఉత్సవాలు సజావుగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అగ్ని ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అన్ని దుర్గామాత విగ్రహాలను జియో ట్యాగ్ చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా మహిళలు తమ ఇళ్ల ముందు బతుకమ్మ ఆడతారు కాబట్టి బహిరంగ ప్రదేశాలు అవసరమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు.






# జీఎస్టీ లబ్ధులను వివరించేందుకు కొంపల్లిలో పాదయాత్ర చేసిన ఈటల రాజేందర్

**కొంపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రధానీ నరేంద్ర మోడీ జీఎస్టీ పన్ను భారం తగ్గించడంతో సామాన్యులకు ఎలాంటి లబ్ధి చేకూరుతుందో వివరించడంలో భాగంగా కొంపల్లి కమాన్ నుండి శివాలయం వరకు పాదయాత్ర చేస్తూ యాజమాన్యాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.కేంద్ర పార్టీ పిలుపుమేరకు జిఎస్టి వల్ల ప్రజలకు ఏ విధమైన లబ్ధి చేకూరుతుందో దాన్ని వివరించే కార్యక్రమాన్ని మనకు అప్పగించారు.గతంలో రాష్ట్రాన్ని బట్టి వస్తువు రేటు ఉండేది.. ఏ రాష్ట్రంలో అయితే తక్కువ ఉంటుందో అక్కడ కొనుగోలు చేసి ఎక్కువ టాక్స్ కు అమ్ముకునే బ్లాక్ మార్కెట్ జరిగేది.యూపీఏ ప్రభుత్వం బ్లాక్ మార్కెట్ ను నివారించాలని చూసిన కాలేదు. నరేంద్ర మోడీ ధైర్యం చేసి మూడేళ్లు జీఎస్టీ పై అధ్యయనం చేసి పేద ప్రజలకు ధరలు అందుబాటులో ఉండేలా చేశారు. ఒకప్పుడు సెల్ ఫోన్లు, ఏసీలు, కార్లు ఏవి కావాలన్నా ఇతర దేశాల నుండి తెచ్చుకునే వాళ్లం . మోడీ వచ్చిన తర్వాత మన దగ్గర ఉన్న యువశక్తి, మేధా సంపత్తును ఉపయోగించుకొని "మేక్ ఇన్ ఇండియా మేడ్ ఇన్ ఇండియా" అనే నినాదానికే పరిమితం కాకుండా ఇక్కడే అన్ని వస్తువులు తయారు చేసే విధంగా మార్చారు. 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ నాలుగవ ఆర్థిక వ్యవస్థకు వచ్చింది. అది మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని మోడీ కలలు కంటున్నారు దానికి మనందరం కూడా తోడ్పాటు అందించాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, సతీష్ సాగర్, రాజిరెడ్డి, జనార్ధన్ రెడ్డి, సరిత, ఝాన్సీ, శివాజీ, నర్సింగరావు, కృష్ణవేణి, నాగమణి, నరసింహ, గోపాల్ రెడ్డి, శ్రీకాంత్, మురళీకృష్ణ, మహేశ్వర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, ఆకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దేవీ నవరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు



**కాప్రా, సెప్టెంబర్ 22(తెలంగాణ ముచ్చట్లు):** దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మీర్పేట్ హెచ్ బీ కాలనీ, డివిజన్ హెచ్ బీ కాలనీ, వెంకటేశ్వర నగర్ షిరిడి సాయిబాబా ఆలయం లో ఏర్పాటు చేసిన అమ్మవారి దర్శన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి ప్రత్యేక పూజల ద్వారా భక్తులకు ఆత్మీయ సందేశాలు అందించారు.పూజల అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, అమ్మవారి ఆశీర్వాదాలు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ కురిసేలా ఉంటారని ఆకాంక్షించారు. అనంతరం ఆయన, కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి శాలువాతో సన్మానింపబడ్డారు.ఈ కార్యక్రమంలో షిరిడి సాయిబాబా సంస్థ ట్రస్టు కార్యవర్గ సభ్యులు నాదం చారి, వీరభద్రరావు, సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు బోదాసు లక్ష్మీనారాయణ, నేమూరి మహేష్ గౌడ్, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
మంగళవారం-23- సెప్టెంబర్ 2025
వరంగల్




## మర్యాదపూర్వకంగా చింతకాని ఎస్ ఐ ని కలిసిన టి ఆర్ ఎస్ మండల నాయకులు

**ఖమ్మం బ్యూరో,సెప్టెంబర్ 22, తెలంగాణ ముచ్చట్లు;** చింతకాని ఎస్ ఐ బాధ్యతలు స్వీకరించిన వీరేందర్ ని టి ఆర్ ఎస్ మండలనాయకత్వం శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ ఎస్ జిల్లా నాయకులు మంకెన రమేష్,మండల కార్యదర్శి బొడ్డు వెంకట్రామయ్య, మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్,మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హన్మంతరావు నాయకులు సామినేని అప్పారావు,కన్నేబోయిన కుటుంబరావు, చాట్ల సురేష్,నన్నక కోటయ్య, షేక్ జానిమియా యువజన విభాగం మండల అధ్యక్షులు పిన్నెల్లి శ్రీనివాస్ ఆళ్ళ పానకలు వంకాయలపాటి సత్యనారాయణ ఉపేందర్ కొండల్ తునికి పాటి పూర్ణయ్య కనకాల సతీష్ , పరిశుద్ధారావు, ఆళ్ల పానకాలరావు తదితరులు పాల్గొన్నారు.



## కాప్రా నాయక్ నగర్ బంజారా కాలనీలో శ్రీ దేవీ శరన్నవరాత్రుల ఘనారంభం

**కాప్రా, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు విఠల్ నాయక్ దంపతులు కాప్రా నాయక్ నగర్ బంజారా కాలనీలోని భవాని మాత మండపంలో జరిగిన శ్రీ దేవీ శరన్నవరాత్రుల మొదటి రోజు పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విఠల్ నాయక్ మాట్లాడుతూ - ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, భవానీ మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి స్థానికులతో కలిసి పూజలు చేస్తున్నామని తెలిపారు.మొదటి రోజు అమ్మవారి ని శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించామని, ప్రతి రోజూ అమ్మవారిని వేర్వేరు అవతారాలలో అలంకరించి భక్తులకు దర్శనమిస్తారని ఆయన వివరించారు.కాప్రా పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించామని విఠల్ నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయక్ నగర్ బంజారా కాలనీ వాసులు, భవాని మాత మాలదారులు, భక్తులు పాల్గొన్నారు.



## దేవి నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

**ఉప్పల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ మహంకాళి దేవాలయం, పోచమ్మ దేవాలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవాలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అమ్మవారిని పూలతో, దీపాలతో అలంకరించి భక్తులకు మహా దర్శనం కల్పించారు. స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ తెల్కల మోహన్ రెడ్డి, ఈగ ఆంజనేయులు, భాస్కర్, గుమ్మడవెల్లి కృష్ణ, మంద మురళి కృష్ణారెడ్డి, అన్నపు రెడ్డి కృష్ణారెడ్డి, కన్యమైన నరేష్, షాగా శేఖర్, కర్ణ ముదిరాజ్, గౌరిగ బీరప తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని



**వనపర్తి,సెప్టెంబర్22(-తెలంగాణ ముచ్చట్లు):** చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామానికి చెందిన పుట్టమౌని వైష్ణవి జాతీయ స్థాయిలో కరాటే పోటీలలో పతకాలు సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. ముంబైలోని ఆంధేరి క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఐదవ అంతర్జాతీయ కరాటే పోటీలలో ఐకాన్, చోటా ఖాన్ విభాగంలో పాల్గొన్న వైష్ణవి బంగారు మరియు వెండి పతకాలు గెలుచుకుంది. ఈ విషయాన్ని కరాటే గురువు సురేష్ గౌడ్ తెలిపారు. ఈ పోటీలలో జపాన్, మలేషియా, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. హైదరాబాద్ గ్రీన్ వుడ్స్ టెక్నో పాఠశాల, నాగోల్ భూపతి ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా ఈ పోటీలలో బంగారు, వెండి పతకాలు సాధించి రాష్ట్ర గౌరవాన్ని నిలబెట్టారని ఆయన తెలిపారు. హైదరాబాద్ గ్రీన్ వుడ్స్ టెక్నో పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న వైష్ణవి విజయం పై తల్లిదండ్రులు టైలర్ బాలరాజు, లక్ష్మి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.







## నాగారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నికలు

**నాగారం, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** నాగారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎన్ఎండబ్ల్యు ఈయూ-సీఐటీయూ) నూతన కమిటీ ఎన్నికలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విస్తృతస్థాయి సమావేశం మరియు మొదటి మహాసభను గోధుమ కుంట శివాలయం వద్ద నిర్వహించారు. సీఐటీయూ కీసర మండల నాయకులు బంగారు నర్సింగరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ - మున్సిపల్ కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, కనీస వేతనం రూ.26,000 నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు ఉన్నతాధికారుల వేధింపులు అరికట్టాలని, కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేసి హక్కులను కాపాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిహెచ్. అశోక్, దమ్మైగూడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఉపాధ్యక్షులు ముక్కెర కృష్ణ, కోశాధికారి మోత్కుపల్లి రాములమ్మతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.నూతన కమిటీ:
అధ్యక్షుడు: బంగారు నర్సింగరావు,
ఉపాధ్యక్షులు: బి. శ్రీను, జాన్ మోషా, ఎమ్. భాగ్యమ్మ,ప్రధాన కార్యదర్శి: కట్ట జంగయ్య,
సహాయ కార్యదర్శులు: సిహెచ్. ఐలయ్య, ఎమ్. అశ్విని, ఎన్.స్వామి,
కోశాధికారి: పి. లలిత,సంయుక్త కార్యదర్శులు: ఎమ్. శ్రీకాంత్, కే. నీరజ, జి. శివ,కమిటీ సభ్యులు: పోశయ్య, బిక్షపతి, సిహెచ్. సురేష్, గ్యార మైసయ్య, పుష్పలత, పెంటమ్మ, బొల్లి అరుణ, లక్ష్మీ నరసింహ, ఎమ్. మన్నెమ్మ, మహంకాళమ్మ తదితరులు పాల్గొన్నారు.





## దరిపల్లి అనంత రాములు కాలేజ్ లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 22, తెలంగాణ ముచ్చట్లు;** స్థానిక ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురం కొత్తూరు గ్రామం శివారులో గల దరిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (బీటెక్ | పాలిటెక్నిక్ | ఎంబీఏ | ఎంటెక్) నందు కళాశాల ఆవరణలో ప్రారంభమైన ఫ్రెషర్స్ డే వేడుకలకి ముఖ్య అతిథిగా వచ్చిన కళాశాల దరిపల్లి విద్యాసంస్థల అధినేత మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దరిపల్లి విద్యాసంస్థల అధినేత మరియు ప్రిన్సిపల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే అనేది సీనియర్ విద్యార్థులు కళాశాల లో నూతనంగా జాయిన్ ఐన జూనియర్ విద్యార్థులకి ఇచ్చే స్వాగత కార్యక్రమ మని ప్రతి ఒక్కరూ మంచిని అలవర్చుకొని దరిపల్లి క్యాంపస్ నందు రిసోర్సెస్ అనగా ఫాకల్టీ, లైబ్రరీ, గేమ్స్, స్పోర్ట్స్, ఎన్ సీ సీ మరియు స్టార్ట్ అఫ్ ది ఫెసిలిటీస్ నీ అందిపుచ్చుకోవాలని తద్వారా ఉన్నత ప్రగతిని సాధించాలని ఆకాంక్షించారు. ప్రతిభ ఉండి 75 శాతం కన్నా ఎక్కువ మార్కులు డిగ్రీ కోర్సులో సాధించిన విద్యార్థినీ విద్యార్థులు తమ కళాశాలలో ఐసెట్ ద్వారా జాయిన్ అయితే విద్యార్థిని విద్యార్థులకు కళాశాల నందు యూనివర్సిటీ కి చెల్లించే ఫీజులు మరియు ఎగ్జామినేషన్స్ మరియు ఇతర ఫీజులు అన్నియు కూడా మెరిట్ స్కాలర్ షిప్ క్రింద కళాశాల నుంచి అందచేయగలమని దరిపల్లి విద్యాసంస్థల అధినేత మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ ఈ సందర్భంగా అందరికీ తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల కి విచ్చేసిన కళాశాల ట్రెజరర్ దరిపల్లి ప్రవీణ్ మాట్లాడుతూ సీనియర్స్ ఇచ్చే స్వాగతసత్కరలికి జూనియర్ విద్యార్థిని విద్యార్థులు తీసుకుంటూనే వారి నుంచి మంచిని నేర్చుకొని తద్వారా మంచి అవకాశాలు అంది పుచ్చుకునేందుకు కళాశాల పూర్వ విద్యార్థుల అలుమ్ని కనెక్ట్ ప్రోగ్రామ్ ద్వారా టాప్ ఏంఎన్ సీ కంపెనీ లలో ఉద్యోగాలు సాధించవచ్చు అన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ దరిపల్లి స్వాతి మాట్లాడుతూ ఫ్రెషర్ డే సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ప్రతి ఒక్కరిని పలకరించటం వలన మీ క్యారెక్టర్ మెరుగు పరచుకోవచ్చని అందరికీ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కి విచ్చేసిన దిశ టీం చైర్మన్ రేవతి గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటి వారితో మంచిగా మెలగాలని, తల్లిదండ్రులను, తోటి విద్యార్థిని విద్యార్థులను, గురువులను, పెద్ద వారిని అందరూ గౌరవించాలని కోరారు. ఈ సందర్భంగా డి డి యూ జే కె వై ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్యాంపస్ నందు చదువుతో పాటు ఆట పాట ల లో కూడా రాణించాలని కోరారు. ఫ్రెషర్ డే కార్యక్రమంలో ఫ్రెషర్ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు, వినోదం, స్కిట్, సోలో, గ్రూప్ డాన్స్ మరియు ఆటలు సీనియర్ విద్యార్థిని విద్యార్థులు చేసి జూనియర్ విద్యార్థులకు మార్గ నిర్దేశకులు అయ్యారు. ఈ కల్చరల్ కార్యక్రమంలో దసరా సందర్భంగా నృత్యం పౌర్ణమి సోలో మరియు అమ్మవారి గ్రూప్ డాన్స్ ద్వారా అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా దరిపల్లి విద్యాసంస్థల అధినేత మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ దరిపల్లి కిరణ్, కరెస్పాండెంట్ దరిపల్లి స్వాతి, కళాశాల ట్రెజరర్ దరిపల్లి ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, అలాగే కళాశాల అభివృద్ధికి తోడ్పడుతున్న విభాగాధిపతులు ఏవో చిరంజీవి, ప్రియాంక, మానసరాజ్, నవీన్, శ్రీనివాస్, రవి కుమార్, వెంకట్రావు లను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, మరియు ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.





## ఉద్యోగ విరమణ చేసిన యామిని బాయి నారాయణ సింగ్ దంపతులకు ఘన సన్మానం

**హన్మకొండ,సెప్టెంబర్22(తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా బాలసముద్రం కమ్యూనిటీ హాల్‌లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా ల్యాదేళ్ల హరిజనవాడ పాఠశాలలో విధులు నిర్వహించిన కోర్ర యామిని బాయి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది.1989లో వెంకటాపూర్ మండలం ఆనందపూర్‌లో ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టిన యామిని బాయి, అనంతరం కోడిశెలకుంట, జగన్నపేట, ములుగు వీవర్స్ కాలనీ, మాధవరావుపల్లె, ములుగు సిపిఎస్ గర్ల్స్ స్కూల్, జీవంతరావుపల్లె, కటాక్షపుపల్లి, ఇంద్రానగర్ పాఠశాలల్లో కృషి చేసి చివరకు ల్యాదేళ్ల పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తించారు. విద్యార్థుల సంఖ్య పెంపు, అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ గోడ ఏర్పాటులో ప్రత్యేక పాత్ర పోషించారు. విద్యార్థుల అభ్యాస నాణ్యత కోసం బీఈడీ పూర్తి చేయడం ద్వారా మరింత నిబద్ధతతో బోధన సాగించారు. విద్యాశాఖ ప్రశంసలతో పాటు 2014లో దళిత-గిరిజన సావిత్రిబాయి పూలే అవార్డు, జిల్లా స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలు పురస్కారాన్ని అందుకోవడం ఆమె సేవలకు గుర్తింపు. మూడు దశాబ్దాలకుపైగా పేద విద్యార్థుల విద్యాబలోపేతానికి చేసిన కృషి, ఆర్థిక సహకారం అందరికీ ఆదర్శప్రాయమని పలువురు అభిప్రాయపడ్డారు.

ఈ సన్మాన కార్యక్రమంలో డాక్టర్ గౌతమి రామ్‌లాల్, శారద ప్రేమ్‌సింగ్, సున్నిధి విక్రమ్, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ లావుడియా శారద రామ్ నాయక్, లావుడియా పల్లవి రాజు నాయక్, జర్నలిస్టులు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కోర్ర విమల జట్‌మాల్, వనిత రవినాథ్, భూక్య భద్రమ్మ లచ్చి రామ్ నాయక్, విద్యారంగానికి చెందిన పలువురు పాల్గొన్నారు. బంధుమిత్రులు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, విద్యార్థులు, స్థానికులు యామిని బాయి - నారాయణ సింగ్ దంపతులను పూలమాలలు, బొకేలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# నకిలీ పత్రాలతో రూ. 50 కోట్ల భూమి కబ్జా యత్నం

**భూ బాధితులు రేఖా, రజిత రెడ్డి ఆవేదన**

**నాగారం, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ పరిధిలో రాంపల్లి గ్రామంలోని భూమిని కాపాడేందుకు భూ బాధితులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. రాంపల్లి గ్రామంలో రేఖా రెడ్డి, రజిత రెడ్డి సొంత భూమిని కాపాడేందుకు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భూ బాధితులు సోమవారం విలేకరులతో సమావేశం నిర్వహించి, సుమారు రూ. 50 కోట్ల విలువ కలిగిన భూమిని సుబ్బారెడ్డి అనే వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి 50 మంది గుండాలతో కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు.
రేఖా, రజిత రెడ్డి తెలిపారు, "రాంపల్లి ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న మా భూమిని సుబ్బారెడ్డి కబ్జా చేయడానికి ప్రహరీ గోడ, చెట్లు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. భూమిపై మా హక్కులను కాపాడే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలి."భూ బాధితుల పిర్యాదు మేరకు కీసర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. ఈ సందర్భంలో రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, కబ్జా దారుల నుండి భూమిని రక్షించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. జెమ్మల నాగేష్ గౌడ్ మీడియా సమావేశంలో తెలిపారు, "మాకు సుబ్బారెడ్డి తో ఎలాంటి సంబంధం లేదు. ఆయన ఎవరో మాకు తెలియదు. రేఖా రెడ్డి, రజిత రెడ్డి కుటుంబ సభ్యులకు భూమి విక్రయించారని సత్యం."గ్రామస్తులు మరియు స్థానికులు భూమి సొంత హక్కులను కాపాడే విధంగా పోలీసులు భద్రతను పెంచి, తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.




# కల్లూరులో క్రీడా మైదానం..
# నాన్ వెజ్ మార్కెట్ స్థల పరిశీలన..!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** కల్లూరు పట్టణంలో లోపలి, బయటి క్రీడా మైదానాల అభివృద్ధి కోసం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ సోమవారం పర్యటించారు.
ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న క్రీడా మైదానాన్ని పరిశీలించిన ఆయన, స్థానిక క్రీడాకారులు, నాయకులతో మాట్లాడారు. క్రీడా మైదానం అభివృద్ధి కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఖమ్మం జిల్లాలో కబడ్డీ శిక్షణకు ఎంపికైన 16 మంది బాలికలలో ముగ్గురు సత్తుపల్లి నియోజకవర్గానికి చెందినవారని గుర్తుచేసి, వారిని కలుసుకుని అభినందనలు తెలిపారు.
తరువాత, కల్లూరు పట్టణంలో చేపలు, కోడి, మేక మాంసం వ్యాపారస్తుల సౌకర్యార్థం ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేయడానికి కల్లూరు పాత బస్‌స్టాండ్ ప్రాంగణాన్ని మండల రెవెన్యూ అధికారి, కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు, సీనియర్ నాయకుడు లక్కినేని కృష్ణ, యువ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆళ్లకుంట నరసింహరావు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.




# పెద్దమందడిలో ఘనంగా చెన్నకేశవ స్వామి ఆలయంలో అమ్మవారి పూజలు

**పెద్దమందడి, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రంలోని శ్రీ భూమిలా చెన్నకేశవ స్వామి ఆలయంలో వేదమంత్రాలతో అమ్మవారి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. భాస్కర్ అయ్యారు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని రాజరాజేశ్వరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ ఎద్దుల రాధాకృష్ణ, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, పురజనులు పాల్గొన్నారు. మాలాధారణ చేసిన భవానీమాతలు అశ్విని రాధామ్మ, కె. రమాదేవి, వాకిటి లక్ష్మి, వాకిటి చంద్రకళ, అంజనమ్మ.వస్త్రదాతలుగా కడియాల బాలకృష్ణ ఏఈ సతీమణి కృష్ణవేణి ముందుకు రాగా, పూజ నిర్వాహక అన్నదాతలుగా పోలీస్ మోహన్ రెడ్డి సతీమణి సువర్ణ, సికింద్రాబాద్ డిఎస్ సురేష్ సతీమణి సుజాతమ్మ వ్యవహరించారు. అఖండజ్యోతి కార్యక్రమాన్ని జిఎస్ గోపి సతీమణి సుగుణవేణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకిటి నాగభూషణం, సేనాపతి, గురుస్వామి శ్రీనివాస్ గౌడ్, అశోక్, ఎద్దుల యశ్వంతు, కోమిరిశెట్టి శ్రీకృష్ణ, అజయ్, సూర వినయ్ సాగర్, హేమంతు చారి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ బన్నాల**

**చిల్కానగర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** చికిత్స ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆశ్రయం అవుతోంది. చిల్కానగర్ డివిజన్ గణేష్‌నగర్ నివాసులు మల్లేష్, సంధ్యలకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుండి వచ్చిన చెక్కును చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సోమవారం అందజేశారు.అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సాయం అందజేస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లేష్, సంధ్యలు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీతా ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తమను సంప్రదించాలని కార్పొరేటర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, చర్యల శ్రీనివాస్, శ్యామ్, బంటి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్గానిక్ పంటలతోనే ఆరోగ్యమైన తెలంగాణ సాధ్యం



డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి – రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు

**వనపర్తి, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** గద్వాల్ పట్టణ కేంద్రంలోని బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో మంజుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆర్గానిక్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూర్వకాలంలో రైతులు పశువుల పేడతో సహజంగా పంటలు పండించేవారని, అయితే నేటి కాలంలో పశువుల సంఖ్య తగ్గిపోవడంతో రసాయన ఎరువులపై ఆధారపడి పంటలు పండిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘెల్ రాష్ట్రంలో ప్రభుత్వం ఆవుపేడను మహిళా సంఘాల ద్వారా సేకరించి రైతులకు అందజేసి ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించిందని ఆయన గుర్తుచేశారు.
భారత జనాభా పెరుగుదలతో కొత్త రకాల వంగడాలను దిగుమతి చేసుకొని అధిక దిగుబడి కోసం రైతులు రసాయన ఎరువులపై ఆధారపడ్డారని అన్నారు. రైతు పక్షపాతి పార్టీగా కాంగ్రెస్ ఎల్లప్పుడూ ఉచిత కరెంటు, రుణమాఫీ, సబ్సిడీల ద్వారా రైతులను ఆదుకున్నదని చెప్పారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి రైతుల సంక్షేమం కోసం చేసిన కృషిని స్మరించుకుంటూ, ఉత్తమ సేంద్రియ రైతు పాలేకర్‌కు రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల నగదు, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించిందని తెలిపారు.
"సేంద్రియ వ్యవసాయం చేయడానికి పాడి పరిశ్రమ అనివార్యం. రైతులు ఆర్గానిక్ పద్ధతులను అవలంబిస్తే రోగాలు తగ్గి, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు" అని డా. చిన్నారెడ్డి పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ రెడ్డి, అయ్యప్ రెడ్డి, అరుంధతి, వనపర్తి మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, గద్వాల్ జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు వెంకటేష్, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులపై ప్రభుత్వం చులకన వైఖరి: పి ఎస్ సి డబ్ల్యూ టి యు సి ఐ



**సత్తుపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం కంటి తుడుపు చర్యగా 500 రూపాయల పెంపు ప్రకటించిందని పి ఎస్ సి డబ్ల్యూ టి యు సి ఐ కొత్తగూడెం రీజియన్ అధ్యక్షుడు అమర్లపూడి శరత్ తీవ్రంగా విమర్శించారు. సత్తుపల్లి సమంత క్యాంప్ బెల్ట్ క్లీనింగ్‌లో ఈరోజు జరిగిన రీజియన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణిలో దశాబ్ద కాలంగా వివిధ విభాగాల్లో సుమారు 30 వేల కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. సంస్థ లాభాలకు వీరి శ్రమ ప్రత్యక్ష-పరోక్ష కారణమని యాజమాన్యం, కార్మికలోకం అంగీకరించిన వాస్తవమే. అయినా ఈరోజు 30 వేల కుటుంబాలను అవమానపరుస్తూ కేవలం 500 రూపాయల పెంపుతో ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను చులకనగా చూసింది. ఇది దౌర్భాగ్యకరమైందే అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కాంట్రాక్ట్ కార్మికులకు సౌకర్యాలు కల్పిస్తామని, వేతనాలు పెంచుతామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేసిన శరత్, "గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించడానికి కార్మికుల ఓట్లను వాడుకున్న కాంగ్రెస్ ఈరోజు వారిని మోసం చేసింది. గతేడాది 5 వేల రూపాయలు బోనస్ ప్రకటించిన ప్రభుత్వం, ఈసారి కనీసం 10 వేల రూపాయలు ప్రకటిస్తుందని కార్మికులు ఆశించారు. కానీ అదనంగా 500 రూపాయలే ప్రకటించడం ఘోర అన్యాయం" అన్నారు. "కాంట్రాక్ట్ కార్మికులకు పండగలు ఉండవా? వారూ మనుషులే కదా. బడుగు, మధ్యతరగతి కుటుంబాల వారికి న్యాయం జరగకపోవడం దుర్మార్గం. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు కూడా మౌనం వహించడం విచారకరం" అని శరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలవడానికి కాంట్రాక్ట్ కార్మికుల ఓట్లు అవసరమయ్యాయి గానీ, వారి జీవనాధారానికి మద్దతు ఇవ్వడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. "ఇప్పటికైనా పునరాలోచన చేసి కాంట్రాక్ట్ కార్మికులకు 10 వేల రూపాయలు బోనస్ ప్రకటించాలి" అని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జాన్, సంజీవరెడ్డి, రవి, ప్రసాద్, రమేష్, కుమార కనకయ్య పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు: ఎస్ ఐ వీరేందర్



**మూడు ట్రాక్టర్లు సీజ్**

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 22, తెలంగాణ ముచ్చట్లు;** చింతకాని మండల పరిధిలోని పందిళ్ళపల్లిలో గంధసిరి మున్నేటి నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 03 ట్రాక్టర్లను చింతకాని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వీరేందర్ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించి వారిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశారు .ఈ సందర్భంగా ఎస్ఐ ఓ ప్రకటనలో ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..





## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

**వరంగల్,సెప్టెంబర్22(తెలంగాణ ముచ్చట్లు):** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్థానిక శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి సోమవారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేయి స్తంభాల ఆలయంలో దుర్గా మాతకు పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక శక్తినిచ్చే ఆధ్యాత్మిక పర్వదినాలని, సమాజానికి శుభసూచక మార్గదర్శకత్వం అందిస్తాయని పేర్కొన్నారు. వరంగల్‌లోని చారిత్రక దేవాలయాలు మన సంస్కృతి వైభవానికి ప్రతీకలని అన్నారు. అమ్మవారి కటాక్షంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వరంగల్ అభివృద్ధి మరింత వేగంగా సాగాలని కోరుకున్నట్లు తెలిపారు.అలాగే భక్తుల సౌకర్యార్థం ఆలయాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేస్తానని ఎంపీ వెల్లడించారు. అనంతరం భక్తులకు చీరల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నేరడలో సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 22, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు ఆర్థిక & విద్యుత్, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన వంకాయలపాటి మమతకు 31,500/ వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన చెక్కును ఆమెకు అందజేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకెన నాగేశ్వరరావు కాంగ్రెస్ గ్రామ నాయకులు చెవుల తిరుపతిరావు గ్రామ పెద్దలు వంకాయలపాటి గోవిందయ్య అలిశ్వం నాగేశ్వరరావు వంకాయలపాటి నరసయ్య సిపిఐ గ్రామ నాయకులు మట్టా రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి మోడీకి బిజెపి సీనియర్ నేత జూపల్లి నరేష్ ధన్యవాదాలు



**నాగారం, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** బిజెపి సీనియర్ నేత జూపల్లి నరేష్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జి.ఎస్.టి. రేట్ల తగ్గింపు నిర్ణయం సామాన్య ప్రజలపై సానుకూల ప్రభావం చూపిస్తుందని ఆయనఅభిప్రాయపడ్డారు.జి.ఎస్.టి .రేట్ల తగ్గింపు: 375 వస్తువులపై ధరలు తగ్గింపు సెప్టెంబర్ 22, 2025 నుండి అమల్లోకి వచ్చిన జి.ఎస్.టి. 2.0 ప్రకారం, 375 వస్తువులపై జి.ఎస్.టి. రేట్లు తగ్గించబడ్డాయి. ఇందులో పాలు, పనీర్, నెయ్యి, వెన్న, బియ్యం, పప్పులు, కూర గాయలు, ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మెషీన్, కారు, బైక్, స్కూటర్ వంటి వస్తువులు ఉన్నాయి. ఈ తగ్గింపు సామాన్య ప్రజల ఖర్చులను తగ్గించడంలో సహాయపడుతుంది.

ప్రధానమంత్రి మోడీ సందేశం

జి.ఎస్.టి. రేట్ల తగ్గింపు సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ చర్య ద్వారా సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ చర్య దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలపరచడంలో సహాయపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.జి.ఎస్.టి. రేట్ల తగ్గింపు సామాన్య ప్రజలపై సానుకూల ప్రభావం చూపుతుంది. ఈ చర్య ద్వారా వారి ఖర్చులు తగ్గి, జీవన ప్రమాణాలు మెరుగు పడతాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ చర్య ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలపరచడంలో సహాయపడుతున్నారు.

## హెచ్ బీ కాలనీలో నూతన డీఐ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- కార్పొరేటర్ ప్రభుదాస్,పన్నాల దేవేందర్



**కాప్రా, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని హెచ్ బీ కాలనీ ఫేజ్ 1 మెయిన్ రోడ్డులో మంచినీటి పాత పైప్‌లైన్ పగిలి, మంచినీటిలో మురుగు నీరు కలిసిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి నూతనంగా ఏర్పాటు చేస్తున్న డీఐ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ – "ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నేను ఎల్లప్పుడూ కృషి చేస్తాను. కాలనీల సమస్యలు పరిష్కరించేందుకు ఎప్పుడూ అందుబాటులో ఉంటాను" అని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీవాసుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ – "డివిజన్ అభివృద్ధి విషయంలో సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే కి ధన్యవాదాలు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఏఈ వేణుగోపాల్, కాలనీ ప్రెసిడెంట్ శివరాం ప్రసాద్, గోవిందరెడ్డి, ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు బోదాసు లక్ష్మీనారాయణ, నేమూరి మహేష్ గౌడ్, రమణ, శివ, దుర్గయ్య, బాబూరావు, నరేష్, దండెం నరేందర్, నిసార్ అహ్మద్ గోరి మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## గృహప్రవేశాలకు సిద్ధమవుతున్న ఇందిరమ్మ ఇళ్లు



**వేలేరు,సెప్టెంబర్22(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో భాగంగా అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం వేగంగా ప్రజాదరణ పొందుతోంది. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని గ్రామాలన్నింటిలో కలిపి ఇప్పటివరకు 3,500 ఇళ్లు మంజూరైన విషయం తెలిసిందే. అందులో భాగంగా వేలేరు మండలం పీచర గ్రామంలో 46 మంది అర్హులకు ఇళ్లు కేటాయించారు.గ్రామంలో కుల, మత, రాజకీయ భేదాభిప్రాయాలు పక్కనపెట్టి, నిజంగా ఇల్లు లేని అర్హులకే ఇళ్లు కేటాయించడం ప్రత్యేకతగా నిలిచింది. ప్రస్తుతం కొంతమంది లబ్ధిదారుల ఇళ్లు బేస్‌మెంట్ వరకు, మరికొన్ని గోడలు, స్లాబ్ వరకు పూర్తి కాగా, కొన్ని ఇళ్లు నిర్మాణ దశ ముగించి గృహప్రవేశాలకు సిద్ధమవుతున్నాయి.ఇల్లు పొందిన లబ్ధిదారులు మాట్లాడుతూ, ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.5 లక్షలతో ఇల్లు నిర్మించి అందజేయడం గొప్ప సహాయం అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా తమ జీవితకాల స్వప్నం నెరవేరుతోందని, ఈ సహకారం ఎప్పటికీ మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన మనీషాకు ఘన సత్కారం



**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 22, తెలంగాణ ముచ్చట్లు;** చింతకాని మండలం నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయానికి చెందిన విద్యార్థిని గార్లపాటి మనీషా తొలి రౌండ్ లోనే ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. మనీషా శ్రీ ఆదర్శ విద్యాలయం విద్యార్థి కావటంతో పాఠశాలలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమెను శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఆమె మున్ముందు ఉన్నత స్థాయికి ఎదగాలని పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ సూచించారు. ఒక గ్రామీణ ప్రాంత విద్యార్థినికి ప్రభుత్వ కళాశాలలో మొదటి కౌన్సిలింగ్ లోనే ఉచిత సీటు లభించటం గర్వకారణమన్నారు. వైద్య విద్యలో రాణించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని బోడేపూడి కిరణ్ సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు రేణుక, పార్వతి, సురేష్, కిరణ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ డీసీపీ అడ్మిన్ గా భాద్యతలు స్వీకరించిన రామానుజం



**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 22, తెలంగాణ ముచ్చట్లు;** ఖమ్మం అడిషనల్ డీసీపీ అడ్మిన్ గా బి. రామానుజం సోమవారం భాద్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్: బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక



# బాదంతో మెదడుకు పదును..

బాదం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ సూపర్ ఫుడ్ మన మెదడుకు పదును పెట్టడమే కాకుండా మన చర్మాన్ని మెరిసేలా చేస్తుంది.చిన్నప్పుడు మన అమ్మమ్మలు, అమ్మలు రోజూ ఉదయాన్నే నానబెట్టిన బాదంపప్పులు తినమని బలవంతం చేసేవారు. ఇవి తింటే చదువు బాగా వస్తుంది, అన్నీ గుర్తుంటాయి అని చెప్పేవారు. ఇవి కేవలం మాటలే కాదు. మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేవి. అవును.. బాదంపప్పులు మన ఆరోగ్యానికి చాలా మంచివి. వాటిలో ప్రోటీన్లు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వాటిని నానబెట్టి తింటే ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి.బాదంలో విటమిన్ ఇ, మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవన్నీ మన మెదడుకు చాలా అవసరం. రోజూ 45 నానబెట్టిన బాదంపప్పులు తింటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చదువుకునే వారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. బాదంపప్పులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. నానబెట్టిన బాదంలో ఉండే ఎంజైమ్‌లు ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా చేస్తాయి. దీనివల్ల మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు తగ్గుతాయి. బరువు తగ్గాలనుకునేవారికి నానబెట్టిన బాదంపప్పులు ఒక అద్భుతమైన ఆహారం. ఇందులో ఉండే ఫైబర్ కారణంగా ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది, దాంతో అతిగా తినడం తగ్గుతుంది. అంతేకాకుండా ఇది మన జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది బరువు తగ్గడంలో సహాయపడుతుంది. నానబెట్టిన బాదంపప్పులు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మన రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బాదంలో ఉండే ఖనిజాలు, విటమిన్లు మన శరీరాన్ని వైరల్ వ్యాధుల నుంచి కాపాడతాయి. మీరు రోజంతా అలసిపోయినట్లు, నీరసంగా ఉన్నట్లయితే ఉదయం పూట నానబెట్టిన బాదం తినడం మంచిది. ఇందులో ఉండే పోషకాలు రోజంతా మిమ్మల్ని శక్తివంతంగా ఉంచుతాయి. బాదంపప్పులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ ఇ చర్మంపై ముడతలు, సన్నని గీతలను తగ్గిస్తాయి. దీని వల్ల చర్మం సహజంగా మెరుస్తుంది. అలాగే ఇందులో ఉండే ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, మెగ్నీషియం జుట్టును పొడవుగా, బలంగా, మరియు నల్లగా పెంచడంలో సహాయపడతాయి. నానబెట్టిన బాదంపప్పులు తినడం వల్ల జుట్టు మెరిసేలా ఉంటుంది.



# రుచి కోసమని నిమ్మరసం వీటితో కలిపి తిన్నారో!

నిమ్మకాయ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఆహారంలో తీసుకోవల్సిన ముఖ్యమైన పదార్థాల్లో కూడా నిమ్మ ఒకటి. చాలా మందికి నిమ్మకాయ లేకుండా భోజనం అసంపూర్ణంగా అనిపిస్తుంది. నిమ్మరసం వేడి వేడి ఆహారంలో అలా చిలికించి తింటే ఆ రుచే వేరు. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, నిర్విషీకరణ లక్షణాలు ఉంటాయి. నిమ్మకాయ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఆహారంలో తీసుకోవల్సిన ముఖ్యమైన పదార్థాల్లో కూడా నిమ్మ ఒకటి. చాలా మందికి నిమ్మకాయ లేకుండా భోజనం అసంపూర్ణంగా అనిపిస్తుంది. నిమ్మరసం వేడి వేడి ఆహారంలో అలా చిలికించి తింటే ఆ రుచే వేరు. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, నిర్విషీకరణ లక్షణాలు ఉంటాయి. నిమ్మ తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. చర్మ రంగు కూడా మెరుగుపడుతుంది. ముఖ్యంగా, బరువు తగ్గడానికి నిమ్మకాయ కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. నిమ్మ ఆరోగ్యానికి ఎంత మేలు చేసినప్పటికీ.. దీన్ని కొన్ని ఆహార పదార్థాలతో కలిపి తీసుకుంటే విషపూరితం అవుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఇది అలెర్జీలు, గ్యాస్, చర్మ సమస్యలను కలిగిస్తుంది. నిమ్మకాయను పాలు, పాల ఉత్పత్తులతో కలిపి మర్చిపోయి కూడా తినకూడదు. దీనివల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. పాలు, నిమ్మకాయను కలిపి తినడం వల్ల కూడా గ్యాస్ సమస్యలు వస్తాయి. గుడ్లు ప్రోటీన్‌కు మంచి మూలం. అయితే గుడ్లు, నిమ్మకాయను ఎప్పుడూ కలిపి తినకూడదు. ఇది అనేక తీవ్రమైన కడుపు సమస్యలను కలిగిస్తుంది.

# మటన్ ఎక్కువగా తింటున్నారా!

ఎర్ర మాంసం పోషకాలతో సమృద్ధిగా ఉన్నప్పటికీ దానిని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన మాంసాలు ఆరోగ్య సమస్యలు తెస్తాయి. ఇటీవలి పరిశోధనలు ఇది గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరించాయి. మటన్ అంటే చాలామందికి ఇష్టమైన ఆహారం. దాని రుచి, పోషకాల కారణంగా దీనిని ఎక్కువగా తింటుంటారు. కానీ ఎర్ర మాంసాన్ని దానిని అతిగా తీసుకుంటే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల జరిగిన కొన్ని పరిశోధనలు ఈ విషయంలో మరింత ఆందోళన కలిగించే విషయాలను వెల్లడిరచాయి. గొడ్డు మాంసం, దూడ మాంసం, పంది మాంసం, గొర్రె, మేక మాంసం వంటి జంతువుల నుండి వచ్చే మాంసాన్ని ఎర్ర మాంసం అంటారు. దీనికి ఎరుపు రంగు రావడానికి కారణం మయోగ్లోబిన్ అనే ప్రోటీన్. ఎర్ర మాంసంలో విటమిన్ బి12, ఐరన్, జింక్, బివిటమిన్లు వంటి



ఎన్నో ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇది శరీరానికి సులభంగా లభించే అధికనాణ్యత ప్రోటీన్‌కు కూడా మంచి మూలం. సుమారు 28 గ్రాములు మాంసంలో 7 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. అందుకే ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా దీనిని అప్పుడప్పుడు తీసుకోవడం మంచిది. పోషకాలు ఉన్నప్పటికీ ఎర్ర మాంసాన్ని వారానికి ఒకసారి మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన మాంసాలైన హామ్, బేకన్, సలామీ వంటి వాటిలో సంతృప్త కొవ్వులు, సోడియం ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతాయి. గుండె జబ్బులు: ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం పరిశోధన ప్రకారం.. రోజుకు 50 గ్రాముల ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసం తినేవారిలో గుండె జబ్బుల ప్రమాదం 18 శాతం పెరుగుతుంది. డయాబెటిస్: ది లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రినాలజీ పత్రికలో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. రోజుకు రెండు ముక్కల హామ్ వంటి ప్రాసెస్ చేసిన మాంసం తినడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 15 శాతం పెరుగుతుంది. కొలెస్ట్రాల్: ఎర్ర మాంసం శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. క్యాన్సర్: ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎర్ర మాంసాన్ని గ్రూప్ 2ఎ క్యాన్సర్ కారకంగా వర్గీకరించింది. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసం, కొలొరెక్టల్ క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్‌లతో ముడిపడి ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఎర్ర మాంసం పోషకాలను అందిస్తున్నప్పటికీ దానిని మితంగా మాత్రమే తీసుకోవడం మంచిది. ప్రాసెస్ చేసిన మాంసాలను వీలైనంత వరకు దూరం పెట్టాలి. ఆరోగ్యకరమైన జీవితం కోసం సమతుల్య ఆహారం తీసుకోవడం, తాజా మాంసాన్ని ఎంచుకోవడం, శారీరక శ్రమ చేయడం అవసరం.

# అరటిని ఈ ఒక్కటి కలిపి తినండి..

శరీరానికి బలాన్నిచ్చే అరటిపండు, సుగంధ ద్రవ్యాల రాణి నల్ల మిరియాలు. ఈ రెండిరటిని కలిపి తింటే ఏం జరుగుతుందో తెలుసా? చాలామంది రోజుకో అరటిపండు తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మాత్రమే ఆలోచిస్తారు. కానీ దానిపై కొద్దిగా నల్ల మిరియాల పొడి చల్లి తింటే అద్భుతమైన ఆరోగ్య లాభాలుంటాయి. ఈ కలయిక మీ ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరుస్తుందో నిపుణుల మాటల్లో తెలుసుకుందాం. మన వంటింట్లో లభించే కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు పోషకాల నిధి. వాటిని సరైన విధంగా, సరైన సమయంలో తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. అరటిపండు, నల్ల మిరియాలు రెండూ శరీరానికి చాలా ఉపయోగకరమైనవి. అరటిపండు




జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, శరీరాన్ని బలపరుస్తుంది. నల్ల మిరియాలు ఆయుర్వేదంలో ఔషధంలా భావిస్తారు. రోజూ ఒక అరటిపండును నల్ల మిరియాల పొడితో కలిపి తింటే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు చూద్దాం. ఈ సమాచారం డైటీషియన్ నందిని అందించారు. జీర్ణక్రియ మెరుగుపడుతుంది: అరటిపండులోని పీచు పదార్థం, నల్ల మిరియాలలో ఉండే పైపెరిన్ జీర్ణ ఎంజైమ్‌లను చురుకుగా మారుస్తాయి. దీనివల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. గ్యాస్, అసిడిటీ, ఉబ్బరం లాంటి సమస్యలు తగ్గుతాయి. కలయికతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది: అరటిపండులో విటమిన్ సి, నల్ల మిరియాలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ రెండిరటిని కలిపి తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రుతువులవల్ల వచ్చే వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.బరువు తగ్గడానికి సహాయం: అరటిపండులోని పీచుపదార్థం ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. దీనివల్ల అతిగా తినకుండా ఉంటారు. నల్ల మిరియాలు జీవక్రియను వేగవంతం చేస్తాయి. ఈ రెండూ బరువు తగ్గడానికి సహాయపడతాయి. గుండె ఆరోగ్యానికి మంచిది: అరటిపండులోని పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. నల్ల మిరియాలు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. వీటిని కలిపి తినడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.

# ఉల్లిపాయలను తింటే క్యాన్సర్ తప్పదా?

ఉల్లిపాయ.. ఇది లేనిదే ఇంట్లో వంటచేయడమే కుదరదు. ఎందుకంటే ఉల్లిపాయను ప్రతిరోజూ ఒకటి కంటే ఎక్కువ ఆహార పదార్థాలలో ఉపయోస్తాం. చాలా ఇళ్లలో గృహిణులు ఉల్లిపాయలు లేవంటే వంటచేయడమే మానేస్తారు. అలా ఉంటుంది వాటి క్రేజ్. కానీ ఈ ఉల్లిపాయల్లో కొన్నింటిని తినడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ప్రతిరోజూ ఏదో ఒక ఆహారంలో మనం ఉల్లిపాయను ఉపయోగిస్తాం. ఇవి లేకుండా కూరగాయాలు చేస్తే అసలు టేస్ట్ ఉండదు. చాలా ఇళ్లలో, గృహిణులు ఉల్లిపాయలు లేకుండా వంట చేయమంటే అస్సలూ కుదరదని మొహం మీదే చెప్పేస్తారు. అలా ఉంటుంది వీటి క్రేజ్ మరీ. అయితే కొన్ని సార్లు ఉల్లిపాయలపై నల్ల మచ్చలు రావడం, లేదా బూజు పట్టడం జరుగుతుంది. అలాంటి వాటిని తినడం ఆరోగ్యానికి చాలా హానికరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అవును మీరు విన్నది నిజమే వీటిని తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయో తెలిస్తే.. అలాంటి వాటిని తినడం మీరు ఇప్పుడే మానేస్తారు. పోషకాహార నిపుణనల ప్రకారం.. కొందరు ఉల్లిపాయలో దెబ్బతిన్న భాగాన్ని, అంటే నల్ల మచ్చలు ఉన్న ప్రాంతాన్ని తొలగించి, మిగిలిన భాగాన్ని మాత్రమే ఉపయోగిస్తారు. కానీ ఇలా చేయడం చాలా పెద్ద తప్పు. ఈ రకమైన బూజు ఎక్కువగా ఉల్లిపాయ లోపలి భాగంలో మాత్రమే కనిపిస్తుంది. దీనిని గుర్తించడం చాలా కష్టం అని వారు చెప్తున్నారు. పోషకాహార నిపుణురాలు ప్రకారం, నల్ల మచ్చలు లేదా బూజు ఉన్న ఉల్లిపాయలను ఎప్పుడూ ఉపయోగించకూడదు. ఇవి మైకోటాక్సిన్ అనే రకమైన టాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తాయి, ఇది మానవ శరీరంపై ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. అటువంటి ఉల్లిపాయలను తినడం వల్ల ఆహార అలెర్జీలు, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. అవే కాకుండా వాటి వల్ల క్యాన్సర్, కాలేయ క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉందని ఆమె చెబుతున్నారు. కాబట్టి వాటిని శుభ్రంచేసి వినియోగించడం కన్నా.. పడేయడం బెస్ట్ అని నిపుణులు చెబుతున్నారు. మనం ఇలాంటి సమస్యల నుంచి దూరంగా ఉండాలనుకుంటే ఎప్పడూ ప్రెష్‌గా ఉండే ఉల్లిపాయలు వినియోగించాలి. అవి టైప్ 2



డయాబెటిస్‌కు ప్రయోజనకరంగా ఉంటాయి. అలాగే రక్తపోటును నియంత్రించడంలోనూ సహాయపడతాయి. వేసవి ఎండలో బయటకు వెళ్ళే ముందు ఉల్లిపాయలు తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. అలాగే హీట్ స్ట్రోక్ ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే ఇది శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయలపై నల్ల మచ్చలు లేదా బూజు రాకుండా ఉండటానికి వాటిని సరిగ్గా నిల్వ చేయడం చాలా ముఖ్యం. చాలా మంది మళ్లీ మళ్లీ ఎవరు కొంటారని.. ఒకేసారి బల్క్‌లో కొని ఇంట్లో పెట్టుకుంటారు. ఇలా ఒకే దగ్గర ఎక్కువ మొత్తంలో నిల్వ చేయడం ద్వారా నల్ల మచ్చలు, బూజూ వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి మీకు అవసరమైన ఉల్లిపాలయను అప్పడే తెచ్చుకొండి. అలాగే మీరు తెచ్చిన ఉల్లిపాయల్ని చల్లని, తేమగా ఉండే ప్రదేశాల్లో ఉంచకండి.



# బొప్పాయిని వీటితో కలిపి తింటే..

బొప్పాయి తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో విటమిన్లు, ఫైబర్, అనేక పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా చర్మాన్ని కూడా కాంతివంతం చేస్తుంది. అయితే బొప్పాయిని కొన్ని ఆహార పదార్థాలతో కలిపి తీసుకుంటే అది విషపూరితంగా మారే ప్రమాదం ఉంది. నిమ్మకాయ లేదా సిట్రస్ పండ్లు: బొప్పాయిని నిమ్మకాయ, నారింజ, లేదా ఇతర సిట్రస్ పండ్లతో కలిపి తినడం చాలామంది చేసే సాధారణ పొరపాటు. ఈ రెండిరటినీ కలిపి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇది గ్యాస్, అసిడిటీ, కడుపు నొప్పి, గుండెల్లో మంట వంటి సమస్యలకు దారితీస్తుంది. గర్భిణీ స్త్రీలు ఈ కలయికను పూర్తిగా నివారించడం మంచిది. ఎందుకంటే ఇది శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలను కూడా ప్రభావితం చేయవచ్చు.దోసకాయలు టమాటాలు: బొప్పాయిని దోసకాయ, టమాటా వంటి కూరగాయలతో కలిపి తినకూడదు. బొప్పాయిలో పపైన్ అనే ఒక ప్రత్యేక ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్లను జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. కానీ దోసకాయ, టమాటాలలో వేరే ఎంజైమ్‌లు, ఫైబర్ ఉంటాయి. వీటిని కలిపి తినడం వల్ల జీర్ణక్రియకు ఆటంకం ఏర్పడి ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. పెరుగు లేదా పాలు: ఆయుర్వేదం ప్రకారం.. పండ్లు, పాలు లేదా పెరుగు కలిపి తినడం ఆరోగ్యానికి హానికరం. బొప్పాయి, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల కడుపులో విషపదార్థాలు ఏర్పడతాయి. దీనివల్ల చర్మంపై దద్దుర్లు, దురద, విరేచనాలు, మలబద్ధకం వంటి కడుపు సమస్యలు వచ్చే అవకాశం ఉంది. బొప్పాయి షేక్ తయారు చేసుకోవాలనుకుంటే పాలకు బదులుగా నీటిని ఉపయోగించడం మంచిది. కాకరకాయ: కాకరకాయతో బొప్పాయిని తినడం అత్యంత ప్రమాదకరమైన కలయికలలో ఒకటి. కాకరకాయ యొక్క చేదు రుచి, బొప్పాయి యొక్క తీపి రుచి శరీరంలో ప్రతికూల ప్రభావాలను సృష్టిస్తాయి. ఇది జీర్ణక్రియ ప్రక్రియను నెమ్మది చేయడమే కాకుండా తీవ్రమైన కడుపు నొప్పి, వాంతులు లేదా విరేచనాలు వంటి సమస్యలకు దారితీయవచ్చు. తేనె: బొప్పాయి తేనె కలిపి తీసుకోవడం వల్ల కొంతమందిలో అలెర్జీ రియాక్షన్స్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పచ్చి తేనెను ఉపయోగిస్తే, అది కడుపు నొప్పి, వికారం, వాంతులు లేదా చర్మంపై దద్దుర్లకు కారణం కావచ్చు. తేనెను విడిగా తీసుకోవడం ఉత్తమం.

Printed Published and Owned by RAJESH BOLLEPAKA Printed at Amulya Publications and Printers Graphics.H.No:2-19/1 Thatikayala Dharmasagar, Hanmakonda.506151 and Published at H.No:2-19/1, Thatikayala, Dharmasagar, Hanmakonda 506151 Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710. Contact:9493669669 Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in